# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 10 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5


## 11న తెలంగాణకు కేంద్ర బృందం

**బలగం టీవి, న్యూఢిల్లీ**

తెలంగాణలో అకాల వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం బృందాన్ని పంపనున్నది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారు, కేంద్ర హెూంశాఖ జాయింట్ సెక్రటరీ (ఆపరేషన్స్–కమ్యూనికేషన్స్) కర్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ఉంటారు. కేంద్ర బృందం బుధవారం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు సహా వరద కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో బృందం పర్యటించనుంది.

కేంద్ర బృందంలో కల్నల్ కేపీ సింగ్‌తో పాటుగా ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, రోడ్లు, రహదారుల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు ఉంటారు. కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులు, అధికారులతో చర్చిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న కల్నల్ కీర్తిప్రతాప్ సింగ్‌తో మాట్లాడారు. ఆదివారం నాటి తన ఖమ్మం పర్యటనలో తెలుసుకున్న అంశాలను, బాధితుల ఆవేదన, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు.

# క్యాన్సర్ మందులపై జీఎస్టీ తగ్గింపు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

క్యాన్సర్ రోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మందుల ధరలపై జీఎస్టీని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. జీఎస్టీ కౌన్సిల్ 54వ సమావేశం సోమవారం జరిగింది. అనంతరం నిర్మలా సీతారామన్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. క్యాన్సర్ మందులతో పాటు స్నాక్స్‌పై జీఎస్టీ రేట్లను తగ్గిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు తెలిపారు. వాణిజ్య ఆస్తులను అద్దెకు ఇవ్వడం రివర్స్ ఛార్జ్ మెకానిజం కిందకు తీసుకువస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. క్యాన్సర్ మందులపై జీఎస్టీని 12శాతం నుంచి 5శాతానికి తగ్గించామని.. దాంతో ఖర్చును మరింత తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎంపిక చేసిన స్నాక్స్‌పై పన్నును 18శాతం నుంచి 12శాతానికి తగ్గించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ఆన్‌లైన్ గేమింగ్ ఆదాయం ఆరు నెలల్లో 412శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకుందని తెలిపారు. రేట్ల హేతుబద్ధీకరణపై జీఓఎం స్టేటస్ రిపోర్టును సమర్పించాల్సి ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఒకటి రియల్ ఎస్టేట్, మరొకటి రేట్ల హేతుబద్ధీకరణపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల స్థితిగతులను సైతం కౌన్సిల్ సమావేశంలో ప్రదర్శించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. క్యాసినో ఆదాయం 30శాతం పెరిగిందని తెలిపారు. ఆరోగ్య బీమాపై మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదికను సమర్పిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆరోగ్య బీమాపై జీఎస్టీని ఎత్తివేసే నిర్ణయం తీసుకోలేదని.. నిర్ణయాన్ని ప్రస్తుతానికి




వాయిదా వేశామన్నారు. ఆరోగ్య బీమాపై రేటును అంచనా వేయడానికి జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదిక అందజేస్తుందని వివరించారు. అంతేకాకుండా మతపరమైన తీర్థయాత్రల కోసం హెలికాప్టర్ సేవల నిర్వహణపై పన్నును ఐదు శాతానికి తగ్గించాలని జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉత్తరాఖండ్ ఆర్థిక మంత్రి ప్రేమ్ చంద్ అగర్వాల్ సోమవారం వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితర తీర్థయాత్రలకు భక్తులను తీసుకెళ్లే హెలికాప్టర్ సేవలపై పన్ను 18శాతం నుంచి 5శాతానికి తగ్గించారు. ఇంతకు డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా రూ.2వేల వరకు చిన్న డిజిటల్ లావాదేవీల కోసం బిల్‌డెస్క్, సీసీ ఎవెన్యూ తదితర చెల్లింపు అగ్రిగేటర్లపై 18 శాతం జీఎస్‌టి విధించే అంశాన్ని కౌన్సిల్ సిఫార్సు కమిటీకి సూచించిందని అగర్వాల్ చెప్పారు. ప్రస్తుతం, అగ్రిగేటర్లు రూ.2వేల కంటే తక్కువ లావాదేవీలపై జీఎస్టీ మినహాయించారు.

## 'దోస్త్' ప్రవేశాల షెడ్యూల్‌లో మార్పులు..

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో వర్షాలు, వరదల నేపథ్యంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్స్ షెడ్యూల్‌లో అధికారులు మార్పులు చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేనలు సోమవారం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు.అర్హత గల విద్యార్థులు రూ.400 చెల్లించి ఈ నెల 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. ఈ నెల 10న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపడతారు. ఈ నెల 12న సీట్లను కేటాయిస్తారు. సీట్లు వచ్చిన వారు ఈ నెల 16 వరకు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయడంతో పాటు, నేరుగా సీటు వచ్చిన కాలేజీల్లోను రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.


## పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా అరికెపూడి గాంధీ

**బలగం టీవి, హైదరాబాద్**

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఎస్టిమేట్స్ కమిటీతో పాటు ప్రజా పద్దుల సంఘానికి చైర్మెన్‌లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి వీ నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ప్రజా పద్దుల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య నియామకం అయ్యారు.పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి వేముల, గంగుల కమలాకర్, రావూరి ప్రకాశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామ్ రావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, భాను ప్రసాద్ రావు, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ నియామకం అయ్యారు.

ఎస్టిమేట్స్ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, విజయ రమణారావు, కోరం కనకయ్య, రామ్‌దాస్ మాలోత్, యశస్విని మామిడాల, రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్ రావు, సుంకరి రాజు, టీ రవీందర్ రావు, యాదవ రెడ్డి నియామకం అయ్యారు.ప్రజా పద్దుల కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజీవ రెడ్డి, లక్ష్మీ కాంతా రావు, కౌసర్ మోహినోద్దీన్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, తాతా మధుసూదన్, మీర్జా రియాజుల్ హసన్ నియామకం అయ్యారు.

## నేతన్నలకు ఏడాదికి
# 1.30 కోట్ల చీరల ఆర్డర్




- **చేనేత రుణాలు రూ.30 కోట్లు మాఫీ చేస్తాం**
- **డ్వాక్రా గ్రూప్ సభ్యులకు ఏడాదికి రెండు చీరలు**
- **ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు**
- **ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

నేతన్నలకు ఏడాదికి 1.30 కోట్ల చీరల ఆర్డర్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అలాగే చేనేత రుణాలు రూ.30కోట్లు మాఫీ చేసి చేనేత కార్మికులను రుణ విముక్తులను చేస్తామని తెలిపారు.సోమవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నేత కార్మికుల కళ్లలో ఆనందం చూడాలని రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేశామన్నారు. రైతన్న ఎంత ముఖ్యమో మాకు నేతన్న కూడా అంతే ముఖ్యమని తెలిపారు. నేతన్నలను ఆదుకోవాలన్న ఉద్దేశంలో రాష్ట్రంలో ఉన్న 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లకు ఏడాదికి రెండు చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు సీఎం వెల్లడించారు.

గతంలో ఆర్భాటం, సినీ తారల తళతళకు బెళుకులు తప్ప.. నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించకుండా ఆలస్యం చేసిందని, కానీ మేం బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించి.. రాజకీయాలకు అతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని.. ఏడాదికి ఒక్కో సభ్యురాలికి రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంచి డిజైన్, క్వాలిటీతో ముందుకు రావాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఏడాదికి దాదాపు కోటి 30 లక్షల చీరల ఆర్డర్ ను నేతన్నలకు ఇవ్వనున్నామని తెలిపారు.

సమాఖ్య సంఘాల ఎన్నికల నిర్వహణ విషయంలో కార్యాచరణ సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలిస్తున్నానని చెప్పారు. మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎలక్షన్, సెలెక్షన్, కలెక్షన్ చేసిన వారిది త్యాగం కాదని, తెలంగాణ కోసం పదవిని తృణప్రాయంగా వదిలేసిన కొండా లక్ష్మణ్ బాపూజీది అసలు సిసలైన త్యాగమన్నారు. త్యాగానికి మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. మేరకు వెంటనే జీవో విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా అని సభాముఖంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు.

తెలంగాణ విద్యార్థులు ఐఐహెచ్‌టీలో చేరాలంటే ఒడిశా, ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని రేవంత్ తెలిపారు. తెలంగాణలో ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం పదేళ్లుగా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశం మా దృష్టికి వచ్చిన వెంటనే ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకంగా ఇన్‌స్టిట్యూట్ ఉండి తీరాలని ప్రధాని, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తెలంగాణ విజ్ఞప్తికి కేంద్రం స్పందించి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సంవత్సరమే ఇనిస్టిట్యూట్ మొదలుపెట్టాలని మేం అధికారులను ఆదేశించామన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది నుంచి స్కిల్స్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీ భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ వెల్లడించారు.



## గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలి

- **ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**
- **గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిపై సీఎం సమీక్ష**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ శివార్లలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రీన్ ఫార్మా పూర్తిగా కాలుష్య రహిత సిటీగా అభివృద్ధి జరగాలన్నారు. భూములు కోల్పోయిన వారికి గ్రీన్ ఫార్మాసిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధి ప్రణాళికలపై సీఎంసుదీర్ఘంగా సమీక్షించారు.

రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పర్యావరణ హితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీలు, తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు.

గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్ గా ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. వీటితో పాటు పరిశోధన, అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వ విద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.



## 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోండి.

- **పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు హైకోర్టు ఆదేశాలు**


**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు షాక్ తగిలింది. అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ సెక్రెటరీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది. గడువులోపు ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లయితే సుమోటోగా మరోసారి విచారణ చేస్తామని తెలిపింది.

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ, ఇతరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇరుపక్షాల వాదనలు గత నెల 7న పూర్తయ్యాయి. నేడు తీర్పును వెలువరిస్తూ పిటిషన్ల విచారణపై షెడ్యూల్ రిలీజ్ చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. నోటీసులు ఎప్పుడు ఇస్తారు, విచారణ ఎప్పుడు జరుపుతారు, ఎప్పటివరకు వాదనలు వినాలి, ఎప్పటిలోగా ప్రొసీడింగ్స్ పూర్తి చేయాలనే విషయాలను ప్రకటించాలని తెలిపింది. నాలుగు వారాల్లోగా షెడ్యూల్ విడుదల చేయకపోతే సుమోటోగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

గత ఏప్రిల్ 24న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు లోతుగా విచారించింది. బీఆర్ఎస్ తరఫున గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద పిటిషన దాఖలు చేయగా, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరొకరు పిటిషన్ దాఖలు చేశారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తప్పకుండా గెలుస్తుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

**పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ : హరీశ్‌రావు**

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుబట్టారు. పీఏసీ చైర్మన్ పదవి విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికార పార్టీ నేతను పీఏసీ చైర్మన్‌గా నియమించిందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మెన్ ఇవ్వడం దారుణమన్నారు. పీఏసీ చైర్మన్ విషయంలో ప్రభుత్వ చర్య అప్రజాస్వామికమని.. నిత్యం రాజ్యాంగం చేతిలో పట్టుకునే రాహుల్ గాంధీ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవి ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలన్నారు.



## 'రోడ్ల విస్తరణకు సహకరించండి'

- **సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కేంద్రం చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించాలని అందులో కోరారు. తెలంగాణలో రైల్వేలు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం చేపడుతున్న చర్యలకు సహకారం ఉండాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వే టెర్మినల్స్‌కు వెళ్లే రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి పదేళ్లుగా ఆ దిశగా చర్యలు

మిగితా 3వ పేజీలో

## రాజన్న ఆలయ విస్తరణ పనులకు శృంగేరి పీఠం ఆమోదం



- **శృంగేరి పీఠంను సందర్శించిన ప్రభుత్వ విప్ అది బృందం..**

**బలగం టీవీ , వేములవాడ**

రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ ఆలయం, దక్షిణ కాశీగా పేరుగాంచిన, కోరిన కోర్కెలు తీర్చే శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు,ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి

మిగితా 3వ పేజీలో

## భారత్‌లో తొలి మంకీపాక్స్ కేసు..

- **హెల్త్ ఎమర్జెన్సీ అవసరంలేదన్న కేంద్ర హెూం మంత్రిత్వశాఖ**

**బలగం టీవి, హైదరాబాద్**



భారత్‌లో తొలి మంకీపాక్స్ (ఎంపాక్స్) కేసు నిర్ధారణ అయింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సోమవారం ధ్రువీకరించింది. ఇటీవల ఓ ఆఫ్రికా దేశం నుంచి వచ్చిన వ్యక్తికి మంకీపాక్స్ సోకిందని వెల్లడించింది. ఆదివారం అనుమానిత కేసుగా భావించిన వ్యక్తికి వ్యాధి నిర్ధారణ అయిందని, నమూనాలను సేకరించి పరీక్షించినట్టు వివరించింది. ప్రయాణ సమయంలో సోకిన కేసుగా నిర్ధారించినట్టు పేర్కొంది. నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షించగా రోగిలో పశ్చిమ ఆఫ్రికా క్లాడ్–2 ఎంపాక్స్ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

ఈ ఎంపాక్స్ కేసు నిర్ధారణపై కేంద్ర హెూం మంత్రిత్వశాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. బాధితుడు ఒక యువకుడు అని, ఎంపాక్స్ వ్యాప్తిని ఎదుర్కొంటున్న ఒక దేశానికి ఇటీవల ప్రయాణించాడని పేర్కొంది. మూడంచెల సంరక్షణ సదుపాయాలు ఉన్న ఐసోలేషన్‌లో ఉన్నాడని తెలిపింది. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని, బహుళ అనారోగ్య సమస్యలు ఏమీ ఉత్పన్నం కాలేదని వివరించింది. కాగా రోగి పేరును కేంద్రం వెల్లడించలేదు.దేశంలో గతంలో నమోదైన మంకీపాక్స్ కేసుల మాదిరిగా ఇది కూడా ఐసోలేట్ కేసు అని, హెల్త్ ఎమర్జెన్సీ అవసరం లేదని తెలిపింది. జులై 2022 నుంచి దేశంలో 30 మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయని, ఇది కూడా వాటి మాదిరేనని స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఈ కేసు పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీలో భాగం కాదని తెలిపింది.

# మారనున్న వేములాడ రూపురేఖలు....



## రాజన్న ఆలయ పరిసరాలు...



- తీరనున్న రాజన్న భక్తుల కష్టాలు..
- ఇక ట్రాఫిక్ కష్టాలు దూరం
- రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న భక్తుల, వేములవాడ వాసులఎన్నో ఏండ్ల నాటికల నెరవేరునుంది. మెరుగైన వసతులు అందుబాటులో రానున్నాయి. ఇప్పటికే ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బంది పడుతున్న భక్తులకు పట్టణ వాసులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా, ఆ కష్టాలను తీర్చనుంది. దీంతో రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు దూరం కానున్నాయి. రాజన్న దర్శనం కోసం వచ్చే భక్తులు, పట్టణవాసులు ఆలయం వద్దకు తిప్పాపూర్ బస్టాండ్ నుండి వెళ్లడానికి రోడ్డు ఇరుకున ఉండడం, దర్శనానికి వచ్చే భక్తులు తో ట్రాఫిక్ ఎక్కువ కావడంతో భక్తులు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.భక్తులకు పట్టణ వాసులకు ట్రాఫిక్ కష్టాలను దూరం చేయడానికి మూలవాగు బ్రిడ్జి నుంచి ఆలయం దాకా రోడ్డు వెడల్పు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కృషి తో విస్తరణ పనులకు మోక్షం లభించింది. అందుకు సంబంధించి శని వారం తెలంగాణ ప్రభుత్వం, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం భూ సేకరణ నిమిత్తం ప్రకటన విడుదల చేసింది.

**ఇటు రాజన్న ఆలయ.. అటు పట్టణాభివృద్ధి..**

ప్రజా ప్రభుత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధి తో పాటు పట్టణ అభివృద్ధి పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస ప్రత్యేక దృష్టి సారించారు.ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు మంజూరు చేసింది.ఇప్పుడు రోడ్డు వెడల్పు పనులకు ప్రకటన విడుదల కావడంతో వేములవాడ పట్టణంతోపాటు ఆలయం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం అవుతుంది.

**స్పష్టమైన ప్రణాళిక..పక్కా ఆచరణ..**

కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక పక్క ఆచరణతో ముందుకెళ్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శనాన్ని అమలులోకి తీసుకొచ్చింది. బ్రేక్ దర్శనం విజయవంతంగా కొనసాగు తుంది. అలాగే భక్తుల ప్రీతిపాత్రమైన మొక్కు కోడె మొక్కుకు వినియోగించే కోడెల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిపై ప్రభుత్వ వేములవాడ ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి కోడెల సంరక్షణకు మూడు షెడ్లు నిర్మింపజేశారు. గోశాలలో సీసీ నిర్మాణం, అలాగే డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టి,గోవులకు పచ్చ గడ్డి, దాణా అందిస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న కోడెలను అర్హులైన రైతులకు ఇప్పటికే అందజేశారు.

అలాగే భక్తులకు తిరుమల తరహాలో నిత్యాన్నదానం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ప్రకటించగా, దానికోసం ఆలయం సమీపంలోని శివార్చన స్టేజి వద్ద సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులను ఇప్పటికే ఆదేశించారు. దానికోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇలా ఒక్కో పనిని స్పష్టమైన ప్రణాళికతో ఆచరణలో పెడుతూ ముందుకు సాగుతున్నారు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ .

ఇప్పుడు వేములవాడలో ట్రాఫిక్ కష్టాలు దూరం చేసేందుకు దూరం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణవాసులు, వాహనదారులు భక్తులు తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు వేగంగా చేరుకునేందుకు మరికొద్ది రోజుల్లో మార్గం సుగమం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేపడుతున్న పనులపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది...





## రెసిడెన్షియల్ విద్యాసంస్థలను అధికారులు తనిఖీ చేయాలి..

- ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, సౌకర్యాల తీరును తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల వారీగా 21 మంది జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులు విద్యాలయాలను తనిఖీ చేయడంతో పాటు ప్రతీ నెలలో ఒక రోజు రాత్రి బస చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న అన్ని రకాల వసతులు, మౌలిక సదుపాయాల తీరు గురించి తనిఖీ చేసిన అనంతరం నోడల్ అధికారి, జిల్లా విద్యాధికారి రమేష్ కు నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**విద్యాలయాల వారీగా ప్రత్యేకాధికారులు వీరే...**

టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), ఇల్లంతకుంట – పి.రజిత, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), నర్మాల, గంభీరావుపేట – ఎం.విజయలక్ష్మి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), మానాల, రుద్రంగి – అర్.వి.రాధాబాయి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), నేరెళ్ళ, తంగళ్ళపల్లి – డి.స్వప్న, ఈడీ ఎస్సీ కార్పొరేషన్,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), చిన్న బోనాల, సిరిసిల్ల అండ్ ఎంజేపీటీబీసీఆర్ ఈఎస్ (బాలికలు) సిరిసిల్ల – అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,టిఎస్ డబ్ల్యూఆం ఈఐఎస్ (బాలికలు), బద్దెనపల్లి, తంగళ్ళపల్లి – వసంత లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), తంగళ్ళపల్లి – కె.ఆర్. లత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి,ఎంజేపీటీబీసీఆర్ ఈఎస్ (బాలికలు) వేములవాడ అండ్ టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలికలు), వేములవాడ – ఎం.గీత, జెడ్పీ డిప్యూటీ సీఈఓ. టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాల (బాలికలు), దుమాల, ఎల్లారెడ్డిపేట – ఎం.ఏ. భారతి, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా పరిశ్రమల శాఖ,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలుర), బోయినిపల్లి – ఎం.సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, హ్యాండ్లూమ్స్,టిఎస్ఈఎంఆర్ఎస్ (కో ఎడ్యుకేషన్ ) మర్రిమడ్ల, కోనరావుపేట – పి.లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి,

టీడబ్ల్యూ ఆశ్రమం (కో –ఎడ్యుకేషన్ )కోనరావుపేట – ఎస్.క్రాంతి కుమార్, ఏడీ మైన్స్,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలుర), ముస్తాబాద్ – వి.రవీందర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి,ఎంజేపీటీబీసీఆర్ఈఎస్ (బాలుర), సర్దాపూర్, సిరిసిల్ల – నజీర్ అహ్మద్, సహాయ లేబర్ అధికారి,ఎంజేపీటీబీసీఆర్ ఈఎస్ (బాలుర), మండెపల్లి, సిరిసిల్ల – పి.బి.శ్రీనివాస చారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి,

టి టి డబ్ల్యూ యు ఆర్ జే సి (బాలుర), తంగళ్ళపల్లి – టి.రామకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి,టిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ (బాలుర), వేములవాడ – వినోద్, జెడ్పీ సీఈఓ.

ఎంజేపీటీబీసీఆర్ ఈఎస్ (బాలుర), వేములవాడ – ఎస్.రాజేశ్వర్, ఆర్డీఓ, వేములవాడ, టిఎస్ఈఎంఆర్ఎస్ (కో ఎడ్యుకేషన్ ) ఎల్లారెడ్డిపేట – ఎ. రాందాస్, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి

## భాషాభివృద్ధికి కాళోజీ సేవలు మరువలేనివి...

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టివీ,రాజన్న సిరిసిల్ల:**

భాషాభివృద్ధికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కాళోజీ చిత్ర పటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, డీవైఎస్ఓ రాములు, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి...

**బలగంటివీ ,వేములవాడ:**

వేములవాడ లో ని శ్రీ రాజారాజేశ్వర స్వామి వారిని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వం విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారికి ఇష్టమైన కోడె ముక్కు చెల్లించి,రాజన్న ను దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసినారు,అనంతరం ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు శాలువాతో సత్కరించి లడ్డు ప్రసాదం అందజేశారు. వెంట స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు అన్నారం శ్రీనివాస్, తోట రాజు, దూలం భూమేష్, రెగ్జిన్ శ్రీనివాస్, గుర్రం తిరుపతి, పోతుగంటి వెంకన్న, నక్క సాయి, మర్రిపల్లి రాజు, ఇన్నారం సాగర్, తదితరులు ఉన్నారు



## తెలుగు సాహితీ రంగానికి కాళోజీ ఎనలేని సేవలు



- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగంటివి,రాజన్న సిరిసిల్ల:**

తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని ఎస్పి అఖిల్ మహాజన్ అన్నారు.సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.కాళోజీ చిత్రపటానికి ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని,తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనీకుడు కాళోజీ నారాయణ రావు అని,తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన కవితల ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడని అన్నారు.భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ తో సన్మానింప బడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్, ఆర్ఎస్ఐ, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది ..

**బలగం టీవీ, వేములవాడ :**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని, ఆలయం లో నెలకొల్పిన గణనాథుని ప్రభుత్వ విప్ , వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..స్వామివారి దర్శనం అనంతరం కల్యాణ మండపంలో ప్రభుత్వ విప్ కు ఆలయ పర్యవేక్షకులు వరి నర్సయ్య శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందించారు.ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసినారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ స్థానిక నాయకులు ఉన్నారు



## ప్రజల మనస్సులో కాళోజీ ఎల్లప్పుడూ జీవించే ఉంటారు...



- సిరిసిల్ల మున్సిపాల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి

**బలగంటివీ,సిరిసిల్ల**

ప్రజల మనస్సులో ఎల్లప్పుడూ జీవించే వారు కొందరే ఉంటారని, అందులో కాళోజీ నారాయణ రావు ఒకరని సిరిసిల్ల మున్సిపాల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు.సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మున్సిపాల్ అఫీస్ లో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ..ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ వాది మరియు గొప్ప కవి తన కవితల ద్వారా ఎంతోమందిలో చైతన్యాన్ని కలుగజేశారు అని, అప్పటి నిజాం కాలంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి జైలు శిక్ష అనుభవించారు అని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తొలి దశ–మలిదశ తెలంగాణ ఉద్యమంలలో పాల్గొని తన కవితల ద్వారా ఎంతోమందికి మార్గదర్శకుడు అని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులుగా విశేష సేవ అందించారు అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోరుకున్న వ్యక్తిగా తన జీవిత కాలంలో అన్ని సందర్భాల్లోనూ అసలుసిసలైన తెలంగాణవాదిగా జీవించారు అని అన్నారు. కాళోజీ గారి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డును అందజేసి సత్కరించగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలి సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ,ప్రజాకవి శ్రీ కాళోజీ నారాయణరావు గౌరవార్థం తెలంగాణ ప్రభుత్వ మెడికల్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు పేరు పెట్టండంతో పాటు, పుట్టినరోజు ను తెలంగాణ భాషా దినోత్సవం గా ప్రకటించి కాళోజీ జయంతి వేడుకలను ప్రభుత్వ పరంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారు అని అన్నారు.దాని కొనసాగింపుగా నేడు తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి కాళోజి జయంతి వేడుకలను ప్రభుత్వపరంగా ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహాత్ అలీ బేగ్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ ,కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మరియు పురపాలక సంఘ సిబ్బంది అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ గారు, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య , సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి ,ఉపాధ్యక్షులు సత్తర్ ,కార్యదర్శి మ్యన రవి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నలకొండ రాఘవరెడ్డి, మార్క్ ఫేడ్ డైరెక్టర్ బండ నర్సయ్య కొంనరావుపేట మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్ పాల్గొన్నారు

# నేడు 5గంటల్లోగా విధులకు హాజరుకావాలి..



- కోల్‌కతాలో వైద్యులకు సుప్రీంకోర్టు ఆదేశం
- సోషల్ మీడియా నుంచి బాధితురాలి చిత్రాలన్నింటినీ వెంటనే తొలగించాలని ఆర్డర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

కోల్‌కతాకు చెందిన వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసు ఘటనపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీబీఐ కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించింది. అదే సమయంలో బెంగాల్ ప్రభుత్వం సైతం రిపోర్టును సైతం కోర్టుకు సమర్పించింది. వైద్యులు విధులకు హాజరుకాకపోవడంతో 23 మంది ప్రాణాలు కోల్పోయారని బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఆ తర్వాత సీబీఐ కొత్త స్టేటస్ రిపోర్టును సమర్పించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఆదేశించింది. విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. అనంతరం విచారణ సందర్భంగా వైద్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. విధులకు వచ్చిన వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. అయితే, ఇంకా వైద్యులు మంగళవారం సాయంత్రం 5గంటల్లోగా విధులకు హాజరుకావాలని చెప్పింది.

నిరంతరాయంగా విధులకు గైర్హాజరయితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చని చెప్పింది. కేసు విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆర్‌జీ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ నివాసం, ఆసుపత్రికి మధ్య దూరాన్ని సీజేఐ అడిగి తెలుసుకున్నారు. దీనికి మెహతా స్పందిస్తూ సుమారు 15 నుంచి 20 నిమిషాల ప్రయాణం ఉంటుందని చెప్పారు. వైద్యురాలు మనందరికీ కూతురులాంటిదని.. ఈ కేసులో దోషులను వీలైనంత త్వరగా శిక్షించాలని సొలిసిటర్ జనరల్ కోరారు. విచారణ సందర్భంగా అసహజ మరణ రిపోర్ట్‌ను దాఖలు చేసే సమయంపై సుప్రీంకోర్టు వివరణ కోరింది. ఈ సందర్భంగా సీసీటీవీ ఫుటేజీ, సీబీఐకి అందించిన ఆధారాలపై సైతం ధర్మాసనం వివరాలు అడిగి తెలుసుకున్నది. కోల్‌కతా ప్రభుత్వం ఇచ్చిన నమూనాలను ఎయిమ్స్, ఇతర కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలకు పంపాలని సీబీఐ నిర్ణయించిందని ఎస్‌జీ మెహతా ధర్మాసనానికి తెలిపారు. పోర్టుమార్టం నివేదికపై మరో న్యాయవాది ప్రశ్నలు లేవనెత్తారు. వెజినల్ స్వాబ్ నాలుగు డిగ్రీల సెల్సియస్ వద్ద భద్రపరచాలని.. కానీ అలా చేయలేదన్నారు.

పోస్టుమార్టం రిపోర్టులో ఎప్పుడు పోస్టుమార్టం చేశారన్న ప్రస్తావన లేదని సొలిసిటర్ జనరల్ చెప్పారు. అత్యాచారం, హత్య కేసులో మొదటి ఐదుగంటలు కీలకమని ఎస్‌జీ మెహతా పేర్కొన్నారు. ఘటన జరిగిన ఐదురోజుల తర్వాత విచారణ చేపట్టిన సీబీఐకి ఎన్నో సవాళ్లు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో దర్యాప్తుపై కొత్త స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని సీబీఐ కోర్టును ఆదేశించింది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో మోహరించిన భద్రతా సిబ్బందికి సంబంధించిన సమస్యను ఎస్‌జీ తుషార్ మెహతా లేవనెత్తారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన మూడు కంపెనీలకు వసతి కల్పించాలని బెంగాల్ హెూంశా సీనియర్ అధికారి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారిని ధర్మాసనం ఆదేశించింది. ఇవాళ రాత్రి 9 గంటలకు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవసరమైన అన్ని వనరులను సమకూర్చాలని స్పష్టం చేసింది. అయితే, ఐకార్డ్ లేకుండా ఎమర్జెన్సీ వార్డులోకి ప్రవేశించేందుకు ఎవరినీ అనుమతించొద్దని ఆదేశించడంతోపాటు వైద్యుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పింది. సోషల్ మీడియా నుంచి బాధితురాలి చిత్రాలన్నింటినీ వెంటనే తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.



ప్రజా కవి, పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాష, సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలను స్మరించుకున్నారు. బలగం టీవి, హైదరాబాద్

## ‘రోడ్ల విస్తరణకు సహకరించండి’

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధి మిషన్ మోడ్‌లో పూర్తవుతోందని పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తో పాటు లైన్ల ఎలెక్ట్రిఫికేషన్ పనులు, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలోని రద్దీని దృష్టిలో పెట్టుకొని చర్లపల్లిలో రూ.415 కోట్లతో రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తైతే పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.715 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి అత్యాధునిక వసతులతో దీన్ని ప్రజలకు అంకితం చేయనున్నామన్నారు. రేతిఫైల్, ఆల్ఫా హెూటల్ వద్ద రోడ్లు ఇరుకుగా ఉండి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయమై చొరవ చూపాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనులకు శృంగేరి పీఠం ఆమోదం



(మొదటి పేజీ తరువాయి)

శృంగేరి పీఠం అనుమతులకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి బృందం సోమవారం శృంగేరి పీఠం సందర్శించారు.రెండు మసాలా క్రితం ప్రభుత్వ విప్ శృంగేరి పీఠన్ని సందర్శించి ఆలయ విస్తరణపై చర్చించినపుడు ఆలయా నమూనా తో రావాలని శృంగేరి పీఠాధిపతి తెలుపగా ప్రభుత్వ విప్ బృందం శృంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతి తీర్థ మహా స్వాముల వారికి,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిసి వారికి ఆలయ విస్తారణ నమూనాలను వారి ముందు పెట్టి,వారి సూచనలు సలహాల అనుగుణంగా ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టడం కోసం ఆజ్ఞను కోరారు..

శృంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతి తీర్థ మహా స్వాముల వారు,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారు పలు సందేహాలకు తగు సూచనలు సలహాలను ఇస్తూ, శుభమని తెలియజేస్తూ ఆలయ విస్తరణకు ముందుకు వెళ్లాలని మౌఖికంగా ఆదేశాలించారు. త్వరలోనే శ్రీశ్రీశ్రీ జగద్గురులు శ్రీ రాజరాజశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ఆలయంలోని ఇతరత్ర అభివృద్ధి పనులకు అక్కడికక్కడే తగు సూచనలు సలహాలు ఇస్తానని పేర్కొన్నారు..

**ఆలయ అభివృద్ధిలో ముందడుగు..**

ఒక వైపు ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక శాఖ మంత్రివర్యులు బట్టి విక్రమార్క, మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహకారంతో రూ. 50 కోట్లు మంజూరు అయ్యాయని, ఇప్పుడు ప్రభుత్వ విప్,అధికారుల బృందం శృంగేరి వెళ్లడంతో ఆలయం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని రాజన్న భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**శారద మాత అమ్మవారి దర్శనం..**

శృంగేరి పీఠంలోని శ్రీ శారదాంబ అమ్మవారిని ప్రభుత్వ విప్,అధికారుల బృందం వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు...ఈ కార్యక్రమం లో దేవాదాయ శాఖ స్థపతి వల్లీనాయకం,శృంగేరి పీఠం తెలంగాణ భాధ్యులు రాధాకృష్ణ , రాజన్న ఆలయ ఈ ఈ రాజేష్, ఆలయ ప్రధాన అర్చకులు నమలికొండ ఉమేష్ శర్మ, చంద్రగిరి శరత్ శర్మ,డి ఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేష్ ,ఇంజనీర్ అసిస్టెంట్ జి అంజయ్య తదితరులు ఉన్నారు...

## బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థుల సమ్మె విరమణ..

**బలగం టీవి, హైదరాబాద్**

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు తమ ఆందోళనకు విరమించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ ఏఎస్) పేరుతో ఏర్పాటైన విద్యార్థుల సంఘం తమ సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు రోజులుగా నిరసన చేపట్టింది ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విద్యార్థులతో చర్చలు జరిపి నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాగ్దానాల కాపీని వీసీ తమకు ఇచ్చారని విద్యార్థులు తెలిపారు. ఆ హామీలు నెరవేరుస్తారనే నమ్మకంతో ప్రస్తుతం సమ్మె విరమణ చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు.



## తెలంగాణకు మరో వందే భారత్ రైలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ కు మరో వందే భారత్ రైలును రైల్వే శాఖ ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి నాగపూర్ మధ్య ఈ నెల 15 నుంచి ఈ కొత్త సెమీ హై స్పీడ్ రైలు పరుగులు పెట్టనుంది. ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా దీనిని ప్రారంభిస్తారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.ఈ వందే భారత్ రైలు నాగపూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయలు దేరి.. మధ్యాహ్నం 12.15 గంటలకు కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మళ్ళీ సికింద్రాబాద్ లో మధ్యాహ్నం 1 గంటలకు బయల్దేరి రాత్రి 8.20 కి నాగపూర్ చేరుకుంటుంది. కాగా కాజీపేట, రామగుండం, బల్లార, చంద్రపూర్, సేవాగ్రామ్ స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుంది.సికింద్రాబాద్, నాగపూర్ నగరాల మధ్య 578 కిమీల దూరాన్ని కేవలం ఏడు గంటల్లో చేరుకుంటుంది. ఇక ఇప్పటికే తెలంగాణకు 4 వందే భారత్ రైళ్లు ఉండగా.. దీంతో ఐదు రైల్లు కానున్నాయి.

## ఘనంగా కాళోజి జయంతి వేడుకలు



**బలగంటివి ,సిరిసిల్ల**

ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని బీఅర్ఎస్ పార్టీ అఫీస్ లో బీఅర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఅర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య మాట్లాడుతూ తన జీవితంలో అన్యాయం ఏ రూపంలో ఉన్న ఎక్కడ ఉన్నా ఎదిరించడమే ఆయన నైజం అని తెలిపారు. అన్యాయాన్ని ఎదిరిస్తే గొడవకు సంతృప్తి, అంతరిస్తే ఆ గొడవకు ముక్తి ప్రాప్తి అన్న గొప్ప వ్యక్తి కాళోజీ అని అన్నారు,స్వతంత్ర భారతంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారని చెప్పారు. తన కలంతో ఎన్నో కవితలు రాసి ప్రజలను, యువకులను ప్రభావితం చేసిన గొప్ప కవి కాళోజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ,బీఅర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ,మాజీ టిఎస్పిడిసి చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్-చైర్మన్ మంచే శ్రీనివాస్ ,నాయకులు బండ నర్సయ్య చంద్రయ్య, రాఘవరెడ్డి మ్యాన రవి ,%వీణ%. సత్తార్ ,అజయ్, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## యువతిని 20 రోజులుగా నిర్బంధించి..

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లో దారుణం జరిగింది. ఓ విద్యార్థినిని హెూటల్ గదిలో నిర్బంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్ 20 రోజులపాటు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ‘షీ టీం‘ పోలీసులు బాధితురాలిని రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలోని భైంసాకు చెందిన బాధిత విద్యార్థికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు బెదిరించి హైదరాబాద్ పిలిపించుకున్నాడు. అక్కడికెళ్లాక నారాయణగూడలోని ఓ హెూటల్ రూముకు తీసుకెళ్లి అందులో నిర్బంధించాడు. 20 రోజుల పాటు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో కంగారుపడిన వారు వెంటనే హైదరాబాద్ చేరుకుని షీ టీమ్స్‌ను ఆశ్రయించారు. బాధితురాలు వాట్సాప్ ద్వారా తల్లిదండ్రులకు లొకేషన్ షేర్ చేయడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. నారాయణగూడలోని ఓ హెూటల్‌లో బాధిత విద్యార్థిని ఉన్నట్టు గుర్తించి రక్షించారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగంటివీ,రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు, వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, మొత్తం 97 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళతాం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హై కోర్టు తీర్పు మీడియా ద్వారా తెలిసిందని.. తాను ఇంకా పూర్తి జడ్జిమెంట్‌ను చూడలేదని తెలిపారు. ఏది ఏమైనా న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. ఈ వ్యవహారంలో అవసరమైతే హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్తామని.. పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

## హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం సీపీ కార్యాలయంలో ప్రస్తుత సీపీ శ్రీనివాస రెడ్డి నుంచి ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్‌ను మరింత మెరుగుపరుస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక భాగం అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని.. నేరస్తులతో స్ట్రాంగ్ పోలీసింగ్ ఉంటుందని తెలిపారు. వినాయక నిమజ్జనం చాలా కీలకమైన అంశం అని, నిమజ్జన ఘట్టం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## మన కాళోజీ ‘గొడవ’ ప్రజల గొడవ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు కాళోజీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పించారు. ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ‘మన కాళోజీ ‘గొడవ’ ప్రజల గొడవ. అచ్చమైన తెలంగాణ వాడుక భాషలో కాళోజీ నారాయణరావు చేసిన రచనలు మాటల తూటాలు. నిరంకుశత్వంపై, అరాచక పాలనపై, అసమానతలపై విమర్శనాస్త్రాలు అన్నారు. ప్రతినిత్యం సామాన్యుల సమస్యలనే, హక్కుల పరిరక్షణే, ప్రజా శ్రేయస్సునే తన జీవితంగా భావించిన తెలంగాణ వైతాళికుడు కాళోజీ. ప్రజాకవిగా పేరొందిన కాళోజీ స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా అందించిన స్ఫూర్తి, చేసిన సేవలు అనిర్వచనీయం. అన్నారు. ధిక్కార స్వరానికి సమున్నత గౌరవం. మన కాళన్న గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే మహెూన్నత ఉద్దేశంతోనే ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ కాళోజీ జయంతిని (సెప్టెంబర్ 9) తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించారు. వైద్య విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టారు. వరంగల్‌లో సుందరమైన కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారు. ధిక్కార స్వరం కాళోజీ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం. కాళోజీ కలం.. సామాన్యుల గళం.. ప్రజలకు బలం.’ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



## ఇంటర్ కాంటినెంటల్ విజేతగా సిరియా

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంటర్‌కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్ టోర్నమెంట్‌లో సిరియా జట్టు విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో వేదికగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో భారత్-సిరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌లో భారత జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. దీంతో దీంతో భారత్ పై సిరియా జట్టు 3-0 పాయింట్లతో అద్భుత విజయం సాధించింది. కాగా, ఫైనల్లో గెలిచిన సిరియా జట్టుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇంటర్ కాంటినెంటల్ కప్ అందజేసి అబినంధించారు.

## ఇంగ్లాండ్‌పై శ్రీలంక సంచలన విజయం



**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో, చివరి టెస్టులో శ్రీలంక 8 వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఇంగ్లండ్ 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలి రెండు టెస్టుల్లో ఇంగ్లండ్ విజయం సాధించిన విషయం తెలిసిందే. కెన్నింగ్టన్ ఓవల్ (లండన్)లో జరిగిన చివరి టెస్టులో శ్రీలంక అసాధారణ ఆటను కనబరిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదర గొట్టిన లంక చారిత్రక విజయాన్ని అందుకుంది. 219 పరుగుల లక్ష్యాన్ని లంక 40.3 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ పాథుమ్ నిసాంకా అజేయ శతకంతో లంకకు చిరస్మరణీయ విజయం సాధించి పెట్టాడు. ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న నిసాంకా కళ్లు చెదిరే శతకం సాధించాడు.

ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన నిసాంకా 124 బంతుల్లోనే 13 ఫోర్లు, రెండు సిక్సర్లతో 127 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని కుశాల్ మెండిస్ (39), ఎంజీలో మాథ్యూస్ 32 (నాటౌట్) సహకారం అందించారు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో కూడా నిసాంకా మెరుగ్గా బ్యాటింగ్ చేశాడు. 51 బంతుల్లోనే 64 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. ఇదిలావుంటే ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 325, రెండో ఇన్నింగ్స్‌లో 156 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు చేసింది. కాగా, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో లంక బౌలర్లు లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, అసిత ఫెర్నాండో సత్తా చాటారు. లహిరు నాలుగు, విశ్వ మూడు, అసిత రెండు వికెట్లను పడగొట్టారు. నిసాంకాకు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

# భారత హాకీ జట్టు దూకుడు




- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండో విజయం
- జపాన్‌పై 5-1తో విజయ దుందుభి

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫి మరో విజయం సొంతం చేసుకుంది. జపాన్‌పై హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 5-1తో గెలుపొందింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ ఆరంభ పోరులో 3-0తో చైనాకు చెక్ పెట్టింది. ఇక జపాన్‌పై కూడా హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి ఆటగాళ్ల ఎత్తులను చిత్తు చేసి.. 5-1తో జయభేరి మోగించింది.

తొలి అర్ధ భాగంలోనే జపాన్ గోల్‌పోస్ట్‌పై భారత ఆటగాళ్లు దాడిచేసి సఫలం అయ్యారు. ఆఖరి అర్ధ భాగంలో జపాన్ ఎట్టకేలకు ఒక్క గోల్ చేయగలిగింది. అప్పటికే సంపూర్ణ అధిప త్యం కలిగిన భారత్ వరసగా రెండో విజయం నమోదు చేసింది. భారత్ తరపున సుఖ్‌జీత్ రెండు, అభిషేక్(మూడో గోల్), సంజయ్(17వ నిమిషం), ఉత్తమ్ సింగ్(54వ నిమిషం)లు తలా ఒక గోల్ సాధించారు. సెప్టెంబర్ 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో మలేషియాతో భారత జట్టు తలపడనుంది.

# తొలి టెస్టుకు భారత జట్టు ఇదే..



**బలగం టీవీ, హైదరాబాద**

రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా త్వరలోనే బంగ్లాదేశ్ తో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మేరకు తొలి టెస్టు కోసం బీసీసీఐ 16 మందితో కూడిన స్క్వాడ్‌ను వెల్లడించింది. కారు యాక్సిడెంట్ తర్వాత టీ20 వరల్డ్ కప్‌లో భారత జట్టుకు ఆడిన రిషభ్ పంత్ తుది బృందంలో చోటు దక్కించుకున్నాడు. దులీప్ ట్రోఫీలో బంతితో అదరగొట్టిన యశ్ దయాల్, ఆకాశ్ దీప్‌లపై కూడా స్క్వాడ్‌లో ఉన్నారు. సెప్టెంబర్ 19న భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అనంతరం సెప్టెంబర్ 27 కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియంలో రెండో టెస్టు నిర్వహించనున్నారు.

**భారత జట్టు : రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.**

# ఇండియా-బీ ఘన విజయం

- మరో మ్యాచ్‌లో ఇండియా సీ విజయం
- దులీప్ ట్రోఫీ-2024లో

**బలగం టీవీ, హైదరాబాద్**

దులీప్ ట్రోఫీ-2024లో ఇండియా-బీ ఘన విజయం సాధించింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఇండియా-ఏతో జరిగిన మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో నెగ్గింది.ఓవర్‌నైట్ స్కోరు 150/6తో ఆఖరి రోజు ఆటను ఆరంభించిన ఇండియా-బీ 184 పరుగులకే కుప్పకూలింది. రిషభ్ పంత్ (47 బంతుల్లో 61 , 9 ఫోర్లు, 2 సిక్సర్లు), సర్ఫరాజ్ ఖాన్ (36 బంతుల్లో46, 7 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్లు. ఆకాశ్ దీప్ అయిదు వికెట్లు, ఖలీల్ అహ్మద్ మూడు వికెట్లతో చెలరేగారు. అనంతరం 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-ఏ జట్టు 198 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ ( 121 బంతుల్లో 57, 7 ఫోర్లు), ఆకాశ్ దీప్ (42 బంతుల్లో 43, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) పోరాడారు. యశ్ దయాల్ మూడు, ముకేశ్ కుమార్, నవదీప్ సైని చెరో రెండు వికెట్లు తీశారు.

అంతకుముందు మొదటి ఇన్నింగ్స్‌లో ఇండియా-బీ 321 పరుగులు చేసింది. ముషీర్ ఖాన్ ( 373 బంతుల్లో 181, 16 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ శతకం బాదాడు. నవదీప్ సైని



(144 బంతుల్లో 56, 8 ఫోర్లు, 1 సిక్సర్) అర్ధశతకం సాధించాడు. ఆకాశ్ దీప్ నాలుగు వికెట్లు తీశాడు. ఇండియా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 231 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (37) టాప్ స్కోరర్. ముకేశ్ కుమార్, నవదీప్ సైని చెరో మూడు, సాయి కిశోర్ రెండు వికెట్లు తీశారు.

**మరో మ్యాచ్‌లో ఇండియా సీ విజయం**

దులీప్ ట్రోఫీ-2024లో రుతురాజ్ గైక్వాడ్ జట్టు బోణీ కొట్టింది. అనంతపురం వేదికగా ఇండియా-డీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-సీ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆరు పాయింట్లతో పట్టికలో సీ-టీమ్ అగ్రస్థానంలో నిలిచింది.

ఓవర్‌నైట్ స్కోరు 206/8తో మూడో రోజు ఆటను ఆరంభించిన ఇండియా-డీ 236 పరుగులకు ఆలౌటైంది. ఫస్ట్ ఇన్నింగ్స్ హీరో అక్షర్ పటేల్ (59 బంతుల్లో 28, 2 ఫోర్లు, 1 సిక్సర్) పర్వాలేదనిపించాడు. అక్షర్ ఔటైనా కొన్ని నిమిషాలకే డీ జట్టు ఆఖరి వికెట్ కూడా కోల్పోయింది.దేవదత్ పడిక్కల్ ( 70 బంతుల్లో 56, 8 ఫోర్లు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (44 బంతుల్లో 54, 9 ఫోర్లు, 1 సిక్సర్) అర్ధశతకాలు సాధించారు. మానవ్ సుతార్ ఏడు వికెట్లతో విజృంభించాడు. అనంతరం 233 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సీ జట్టు 61 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆర్యన్ జుయాల్ ( 74 బంతుల్లో 47, 3 ఫోర్లు, 1 సిక్సర్), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ( 48 బంతుల్లో 46, 8 ఫోర్లు), రజత్ పటిదార్ (77 బంతుల్లో 44, 6 ఫోర్లు, 1 సిక్సర్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.అభిషేక్ పోరెల్ (35 నాటౌట్, 63 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్సర్), మానవ్ సుతార్ ( 43 బంతుల్లో 19, 2 ఫోర్లు, 1 సిక్సర్) జట్టును విజయతీరాలకు చేర్చారు. సరన్ష్ నాలుగు వికెట్లు తీశాడు. కాగా, టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా-డీ తొలి ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌటైంది. అక్షర్ పటేల్ (118 బంతుల్లో 86, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) టాప్ స్కోరర్. విజయ్‌కుమార్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం ఇండియా-సీ మొదటి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకు ఆలౌటైంది. ఇంద్రజిత్ (149 బంతుల్లో 79, 9 ఫోర్లు) అర్ధశతకం సాధించాడు. హర్షిత్ రాణా నాలుగు వికెట్లు పడగొట్టాడు.



# యూఎస్ ఓపెన్ టైటిల్ విజేత సిన్నర్



**బలగం టీవీ, హైదరాబాద్**

యూఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ టైటిల్‌ను జాన్నిక్ సిన్నర్ గెలిచాడు. ఫైనల్లో అతను ఫ్రిట్జ్‌పై గెలుపొందాడు. డోపింగ్ వివాదం నుంచి బయటపడ్డ.. సిన్నర్ తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు.

ఫైనల్లో అతను టేలర్ ఫ్రిట్జ్‌పై 6-3, 6-4,7-5 స్కోరు తేడాతో విజయం సాధించాడు. నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ సిన్నర్.. తన బేస్‌లైన్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. ఇటీవల డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలినట్లు సిన్నర్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. 23 ఏళ్ల ఇటలీ ప్లేయర్ సిన్నర్.. తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ సాధించాడు. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ కూడా గెలిచాడతను. యూఎస్ ఓపెన్‌లో అమెరికా టెన్నిస్ ప్లేయర్ టైటిల్ గెలిచే అవకాశాన్ని సిన్నర్ అడ్డుకున్నాడు. 21 ఏళ్లుగా యూఎస్ ఓపెన్‌లో అమెరికా ప్లేయర్‌కు టైటిల్ దక్కలేదు.





# పారాలింపిక్స్‌లో భారత్‌కు రికార్డు స్థాయి పతకాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

పారిస్ పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తాచాటారు. 29 పతకాలతో భారత జెండాను ప్రపంచవేదికపై రెపరెపలాడించారు. పతక లక్ష్యంగా 84 మంది బయలుదేరి 29 మెడల్స్ సాధించడమంటే సాధారణ విషయం కాదు. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్య పతకాలు సాధించారు. పతకాల పట్టికలో 18వ స్థానంలో దేశాన్ని సగర్వంగా నిలబెట్టారు. గత టోక్యో పారాలింపిక్స్ 19 పతకాలను ఆదిలోనే అధిగమించి అదరగొట్టారు.

1968 నుంచి పారాలింపిక్స్‌లో భారత్ పోటీపడగా.. 2016 పారాలింపిక్స్ వరకు మన క్రీడాకారులు 12 పతకాలే సాధించారు. కానీ ఆ తర్వాత కథ మారింది. గత రెండు పారాలింపిక్స్‌లో ఏకంగా 48 పతకాలు సాధించారు. 12 స్వర్ణాలు, 17 రజతాలు, 19 సార్లు కంచు మోత మోగించారు.

# అబుదాబి క్రౌన్ ప్రిన్స్‌తో మోడీ భేటీ



**బలగం టీవీ, అబుదాబి**

: అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ బిన్ సుల్తాన్ అల్ నహ్యాన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం భారత్, యూఏఈకి చెందిన సంస్థల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరాయి.అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య ఎల్‌ఎన్‌జీ సరఫరా కోసం ఒప్పందం కుదిరింది. ఏడీఎన్‌ఓసీ, ఇండియా స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఎమిరేట్స్ న్యూక్లియర్ ఎనర్జీ కంపెనీ, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ బరాకా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్వహణకు ఆమోదం లభించింది. భారత్‌లో ఫుడ్ పార్కుల ఏర్పాటుపై గుజరాత్ ప్రభుత్వం, అబుదాబి డెవలప్‌మెంటల్ హోల్డింగ్ కంపెనీ ఎంఓయూ చేసుకున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.



## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ విస్తరణ పనులు...

- రాజన్న ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక..
- శృంగేరి పీఠాధిపతి సూచనలు, సలహా మేరకు ముందుకు వెళ్తాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ నమూనాలను పరిశీలించి,ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ అధికారులతో కలిసి ఆలయ ఈఓ గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ ఆలయం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు, మెరుగైన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు . ఆహ్లాదకర వాతావరణం కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను శృంగేరి పీఠం, పండితులు, భక్తుల సూచనల మేరకు చేపట్టి ముందుకు వెళ్తామని అన్నారు.

గతంలో శృంగేరి పీఠన్ని సందర్శించినపుడు ఆలయ విస్తరణ నమూనాతో రావాలని అన్నారు. .ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 కోట్లు మంజూరు చేసిందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ విస్తరణపై ప్రత్యేక దృష్టి సరించారనిఅన్నారు .ఆలయ విస్తరణ పై నమూనాలను శృంగేరి పీఠాధిపతి ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిసి వారి సూచనలు సలహాల ప్రకారం ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపడుతామని,ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఆలయాన్ని విస్తరిస్తామని అన్నారు.

**జీవో నంబర్ 149 రద్దు పై చర్చా..**

గత ప్రభుత్వ హయంలో వేములవాడ రాజన్న ఆలయ పరిసరాలలో నూతనంగా 1000 మీటర్ల (కిలో మీటర్ ) పరిధిలో చేపట్టబోయి నిర్మాణాలపై ఇచ్చిన జీవో నెంబర్ 149 రద్దు పై చర్చించారు.. ఈ జివో వలన పట్టణంలో ఆలయం పరిసరాల్లో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని,జీవో నంబర్ 149 రద్దుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు..

వేములవాడ పట్టణంతో పాటు ఆలయ అభివృద్ధి పై ప్రభుత్వం ముందుకు పోతుందని స్పష్టం అన్నారు. ఈ కార్యక్రమం లో డి ఈ రఘునందన్, ఏఈఓ లు బ్రహ్మన్న గారి శ్రీనివాస్ ,జి రమేష్ బాబు,ఇంచార్జ్ స్థానాచార్య శ్రీ ఎన్ ఉమేష్ , ప్రధాన అర్చకులు శ్రీ ఈ సురేష్, ఉప ప్రధానార్చకులు సి హెచ్ శరత్ ,ఏఈ రామ్ కిషన్ రావు, ఎడ్ల శివ సాయి, వంశీ మోహన్ తదితరులు ఉన్నారు...

# మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుపై మరో కేసు



**బలగం టీవీ, అబుదాబి**

మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు పైనా మరో కేసు నమోదైంది. కూకట్‌పల్లిలోని ఓ భూ వివాదంలో కలగజేసుకొని బాధితులను బెదిరించారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. సర్వే నెంబర్ 1007లో గల 340 ఎకరాలకు సంబంధించి నకిలీ పత్రాలను తయారు చేసిన వారికి ఏసీపీగా పనిచేసిన సమయంలో భుజంగరావు సహకరించారని బాధితులు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతికి ఫిర్యాదు చేశారు. ఎస్ఎస్ మొయినుద్దీన్, శ్రీనివాస్‌రావు, చలమలశెట్టి అనిల్‌లకు భుజంగరావు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. దీంతో సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేశారు. ఏ4గా నిందితుడు భుజంగరావు పేరును చేర్చారు. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అనారోగ్యం సమస్యల కారణంగా ఆయన బెయిల్?పై జైలు నుంచి విడుదల అయ్యారు.

# హైడ్రా పేరుతో కాంగ్రెస్ హైడ్రామాలు : కేంద్ర మంత్రి



**బలగం టీవీ, హైదరాబాద్**

హైడ్రా పేరుతో కాంగ్రెస్? ప్రభుత్వం హైడ్రామాలాడుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. గత కొద్దిరోజులుగా హైడ్రా వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే విశ్వాసం పోతోందన్న ఆయన, సామాన్యులను సైతం ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. తాను మొదట హైడ్రాకు మద్దతు ఇచ్చానని, పెద్దలు అక్రమంగా కట్టుకున్న భవనాలను, విల్లాలను, ఫాంహౌజ్‌లను కూల్చితే సమర్థించానన్నారు. కానీ పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులను, పేదల ఇండ్లను కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇవాళ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బండి సంజయ్?తోపాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ తదితరులు పాల్గొన్నారు. దేశం, సమాజం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. కేసీఆర్ ఎన్ని యాగాలు చేసినా ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. మరోవైపు హైడ్రాను హైదరాబాద్‌కే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలున్నా కూల్చేయాలన్న ఆయన, కొన్ని ప్రాంతాలకే హైడ్రా పరిమితం అవుతోందన్న అనుమానాలు ప్రజలకు వస్తున్నాయని తెలిపారు.

# పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు..

**బలగం టీవీ, సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వినాయక చవితి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వినాయకునికి ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులతో కలిసి పూజా కార్యక్రమలు నిర్వహించరు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని అన్నారు.అందరు తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని, కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకున్నానని తెలిపారు.ముఖ్యంగా జిల్లా పరిధిలోని ప్రజలలో ఉన్న సోదరభావం,ఐక్యత ఎంతో సంతోషాన్ని కలిస్తుందని, పోలీసు శాఖ సూచించనలు సలహాల మేరకు ఆయా మండపాల వద్ద నిర్వాహకులు,యువత పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు. నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నవరాత్రులు, నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్, సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ, తంగలపల్లి ఎస్ఐ సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో ప్రజలు సంతోషంగా ఉండాలి..



**బలగం టీవీ, వేములవాడ**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను నమస్కరించుకొని వేములవాడ పట్టణంలో పాత కూరగాయల మార్కెట్ లో న్యూ టైగర్స్ యూత్ క్లబ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో, జేమిని రాయల్ బాయ్స్ ఏర్పాటు చేసిన గణేష్ మండపలలో తొలి పూజా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొని,స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం(మహాసభ) వేములవాడ వారి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 47 వ వార్షికోత్సవాన్ని పునస్కరించుకొని నిర్వహించబోయే వినాయక ఉత్సవ కార్యక్రమల పోస్టర్ను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో వేములవాడ నియోజకవర్గంతో పాటు, సిరిసిల్ల జిల్లాకు ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా చూడాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నానని అన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పల్లె నుంచి మొదలుకొని పట్నం వరకు నేడు ఆ గణనాథుని పూజలు ప్రారంభమయ్యాయని,ఆలయ మండల నిర్వహకులు, యువకులు ప్రభుత్వ చెప్పే సూచనలను సలహాలను పాటిస్తూ శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా భక్తి భావంతోని వినాయక శోభాయాత్రను కన్నుల పండగ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు . భారతదేశం లోని సంస్కృతి సాంప్రదాయాలను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకొని పాటిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్లు, మండప నిర్వహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ ప్రెసిడెంట్‌ను కలిసిన కనమేని చక్రధర్ రెడ్డి..



**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి నూతన అధ్యక్షులు గా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ సీనియర్ నాయ కులు కనమేని చక్రధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నూతన పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు పయనించాలని,సీఎం రేవంత్ రెడ్డి తోడుగా ఉండి మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించాలని అన్నారు .